ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
బుధవారం 22 అక్టోబరు 2025

త్యాగాలే స్ఫూర్తిగా..

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి
● కలెక్టర్ శ్యాంప్రసాద్

● విధులకు పునరంకితమవుదాం: ఎస్పీ సతీష్‌కుమార్ ● పోలీసు అమరవీరులకు ఘన నివాళి


పుష్పగుచ్ఛం ఉంచుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్


అమరవీరుల కుటుంబ సభ్యులతో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేశభద్రత, సమాజ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని విధులకు పునరంకితమవుదామని కలెక్టర్ శ్యాంప్రసాద్ , ఎస్పీ సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. తొలుత సాయుధ పోలీసు బలగాల నుంచి కలెక్టర్, ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వీరితోపాటుగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలతో శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసుల త్యాగాలు వృథా కావన్నారు. పోలీసు అంటే రక్షణ, భద్రత, సేవకు ప్రతిరూపం అన్నారు. ఈ సందర్భంగా అమరులైన పోలీసు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియచేసి, అమరులైన పోలీసులకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల దినం విశిష్టతను వివరించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. సమాజాభివృద్ధి, శాంతిభద్రతలు కాపాడటంలో పోలీసులు పాత్రకీలకమైనదన్నారు. విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీసుల త్యాగాలు వృథా కారాదన్నారు. వారి త్యాగాలను స్మరించుకునేందుకే ప్రతి ఏటా అక్టోబరు 21న అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కారుణ్య నియామకాలకు సంబంధించిన నియామక పత్రాలు, పరిహారం చెక్కులు అందజేశారు.

అమరవీరుల కుటుంబాలతో ఎస్పీ

పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ పలువురు అమరవీరుల కుటుంబాలను కలిశారు. సంస్మరణ దినం కార్యక్రమానికి వచ్చిన వారిని ఎస్పీ కలిసి కుటుంబ స్థితి గతులపై ఆరా తీశారు. సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీలు విజయ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, నరసింగప్ప, హేమంత్‌కుమార్, ఆదినారాయణ, ఏఓ సుజాత, సీసీ రాఘవేంద్ర, ఎస్బీసీఐ వెంకటేశ్వర్లు ఆర్ఐలు వలి, సీఐలు, శివాంజనేయులు, సురేష్, శ్రీనివాసులు, ఆర్ఎస్సైలు, ప్రదీప్ సింగ్, వీరన్న, ప్రసాద్, పట్టణ ప్రముఖులు, పోలీసు కార్యాలయం సిబ్బంది, అమరవీరుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.


సెల్యూట్ చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

జిల్లా అభివృద్ధికి కృషి

● జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్


జేసీ మౌర్య భరద్వాజ్‌కు సత్యసాయి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఎమ్మెల్యే సింధూర, మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో కలిసికట్టుగా కృషి చేద్దామని జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అధికారులతో పేర్కొన్నారు. జిల్లా జేసీగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను స్థానిక కలెక్టరేట్‌లో ఆయన చాంబర్లో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ ఆర్డీఓలు సువర్ణ, శర్మ, మహేష్, ఆనంద్ కుమార్ వేరువేరుగా మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి కూడా జేసీని మర్యాదపూర్వకంగా కలిసి శ్రీసత్యసాయి బాబా ఫొటోను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. జేసీని కలిసిన వారిలో నాయకులు బోయ రామాంజనేయులు, గంగాధర్ నాయుడు, సామకోటి ఆదినారాయణ, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిన్ను అలా చూడలేను తల్లీ..!


చిన్నగంగప్ప

నల్లమాడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.ఎనుములవారిపల్లి గ్రామానికి చెందిన చిల్లా చిన్నగంగప్ప(54) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న చిల్లా పెద్ద గంగప్ప తెలిపిన మేరకు... ఆరు నెలల కిందట చిన్నగంగప్ప అల్లుడు భాస్కర్ మృతి చెందాడు. దీంతో చిన్న వయసులోనే తన కుమార్తెకు వైధవ్యం వచ్చిందని బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో మానసికంగా తీవ్రంగా కుంగిపోయాడు. ఈ నేపథ్యంలో సోమవారం తన పొలం వద్దకు వెళ్లి పురుగులు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కొందరు బంధువులు గమనించి నల్లమాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కదిరికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లగా, అక్కడి వైద్యులు పరీక్షించి, మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేంద్ర రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య కళావతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

13 రోడ్లకు రూ.6.1కోట్లు

● మంత్రి సత్యకుమార్‌యాదవ్


పవన్‌కల్యాణ్‌ను కలిసిన మంత్రి సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రహదారులకు నిధులు మంజూరు చేయడం గ్రామీణాభివృద్ధి పట్ల ఎన్డీఏ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో 13 గ్రామీణ రహదారులకు రూ.6.10కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఉపాధి హామీ పథకం కింద ఈ పనులు చేపడతామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సహకారంతో ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాన్‌ను తాను మంగళవారం కలిసినట్లు తెలిపారు. ధర్మవరం మండలంలో పోతులనాగేపల్లి, కనంపల్లి, కత్తెకొట్టాల గ్రామాల్లో రూ.3.5కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. చింతలపల్లి, వసంతపురం గ్రామాలలో రూ.2.6కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు.

ఘనంగా సత్యసాయి అవతరణ దినోత్సవం

పుట్టపర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సాయి కుల్వంత్ మందిరంలో సత్యసాయి అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా విద్యార్థులు బ్యాండ్ మేళం, వీణ, తబలా వాయిద్యాలతో భక్తులను అలరించారు. కాగా దీపావళి పండుగను ప్రశాంతి నిలయంలో సత్యసాయి విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే.రత్నాకర్ బాణసంచాలు పేల్చి పండుగను జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా దీపావళి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. సోమవారం భారీగా పటాసులు కొనుగోలు చేశారు. జిల్లాలో వాడవాడలా బాణసంచా పేల్చి దీపావళి సంబరాలు జరుపుకున్నారు.


బాణసంచా పేలుస్తున్న ఆర్‌జే రత్నాకర్


చిన్నారుల నృత్యాలు

ఎన్నాళ్లకీ ధరహాసం

మార్కెట్‌లో క్యారెట్‌కు మంచి ధర.. సాగు చేసిన రైతుల్లో ఆనందం

● పొలం వద్దకే వస్తున్న వ్యాపారులు ● ఎకరం రూ. 3 లక్షల నుంచి రూ.4 లక్షలకు కొనుగోలు

తనకల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దుంపజాతికి చెందిన క్యారెట్ పంటకు మంచి రేటు ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటకకు సరిహద్దుగా ఉన్న మండలంలో రైతులు వాణిజ్య పంటగా ఎక్కువగా క్యారెట్ పండిస్తారు. గత ఏడాది తీవ్ర నష్టాలు మిగిల్చిన క్యారెట్‌కు ఈ ఏడాది మంచి ధరలు వచ్చాయి. ప్రసుత్తం ధరలు బాగుండటంతో వ్యాపారులు, దళారులు పొలాల వద్దకే వచ్చి క్యారెట్ కొనుగోలు చేస్తున్నారు. ఎకరం పంటను రూ. 3లక్షల నుంచి రూ. 4లక్షల వరకు కొంటున్నారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 100 ఎకరాలలో పంట సాగు చేసినట్లు రైతులు పేర్కొన్నారు.

సాగు ఇలా..

క్యారెట్ పంట సాగు చేయడానికి రైతులు విత్తనాలను కర్ణాటక రాష్ట్రంలోని చాకివేలు, చేలూరు, బాగేపల్లి, చిక్‌బళ్లాపూర్ ప్రాంతాల నుంచి తెస్తున్నారు. ప్యాకెట్(100గ్రాముల) విత్తనాలను రూ.1800తో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఎకరానికి 15 ప్యాకెట్లు అవసరం అవుతాయన్నారు. ఎరువులు, కూలీల కోసం రూ. 60వేల నుంచి రూ. 80వేలదాకా పెట్టుబడి పెడుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా క్యారెట్ పంటకు తేమ ఎక్కువ అయితే బూడిద, నల్లమచ్చ, గజ్జి లాంటి రోగాలు సోకే ప్రమాదం ఉంది. వీటి నివారణ కోసం రైతులు రెండు లేక మూడు సార్లు రసాయన మందులు పిచికారీ చేస్తున్నారు. గడ్డి లేకుండా చూసుకుంటే సరిపోతుందని, మిగిలిన పంటల లాగా పెద్దగా సస్య రక్షణ కార్యక్రమాలు చేయాల్సిన అవసరం లేదని పంట సాగు చేసిన రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది ఎకరానికి ఖర్చులు పోను రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల దాకా ఆదాయం వస్తున్నట్లు తెలిపారు.


ఈతోడు వద్ద రైతు మధుసూదన్‌రెడ్డి సాగుచేసిన క్యారెట్ పంట

ఆనందంగా ఉంది: మధుసూదన్‌రెడ్డి, రైతు



ఈ ఏడాది ప్రారంభంలో సాగు చేసిన అన్ని రకాల కూరగాయ, వాణిజ్య పంటలు దిగుబడి బాగా వచ్చినా ధరలు లేక కొనేవారు కరువై పొలాలలోనే వదిలివేశాం. ఖరీఫ్ ఆఖరులో సాగుచేసిన క్యారెట్ పంటకు ధరలు రావడంతో వ్యాపారులు పొలాల వద్దకే వస్తున్నారు. పొలంలోనే ఎకరం రూ. 3లక్షల నుంచి రూ. 4లక్షల రేటుతో కొనుగోలు చేస్తున్నారు. నేను ఇప్పటి వరకు 6 ఎకరాల్లో క్యారెట్ పంటను విక్రయించా.

లాటరీలా తయారైంది: రొద్దం నర్సిరెడ్డి, రైతు, ఈతోడు



గత ఏడాది రబీలో సాగుచేసిన అన్నిరకాల కూరగాయ, వాణిజ్య పంటలు నష్టాలనే మిగిల్చాయి. దీంతో చాలా మంది రైతులు కూరగాయ, వాణిజ్య పంటలు సాగు చేయడానికి వెనుకంజ వేశారు. కొందరు మాత్రమే ధైర్యంతో క్యారెట్ సాగు చేశారు. ప్రస్తుతం రేటు బాగుండటంతో రైతుల కళ్లలో ఆనందం కనబడుతోంది. వ్యవసాయం కూడా లాటరీలా తయారైంది. ప్రతి ఏడాది క్యారెట్ ధరలు నిలకడగా ఉంటే ఎకరానికి రూ. 40వేల నుంచి 50వేలు లాభాలు వచ్చేవి. ఈ ఏడాది ధరలు బాగా రావడంతో రూ.2.5 నుంచి 3.5 లక్షల దాకా ఆదాయం వస్తోంది.

గత ఏడాది పొలంలోనే వదిలేశా



గత ఏడాది మూడు ఎకరాలలో క్యారెట్ పంట సాగు చేశా. అడిగే నాథుడే లేకపోవడంతో పొలంలోనే వదిలేశా. ఈ ఏడాది ఖరీఫ్ ఆఖరులో క్యారెట్ సాగు చేస్తే పొలం వద్దకే వ్యాపారులు, దళారులు వచ్చి పోటీ పడి కొంటున్నారు. ఖర్చులుపోను ఎకరానికి రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల దాకా ఆదాయం వస్తోంది. - అమర్‌నాథ్‌రెడ్డి, ఉప్పువాండ్లపల్లి

పొలం వద్దకే వ్యాపారులు



నేను రెండు ఎకరాలలో క్యారెట్ సాగు చేశా. ఎకరానికి రూ. 90 వేల దాకా పెట్టుబడి పెట్టా. ప్రస్తుతం క్యారెట్ పంటకు మంచి డేటు ఉండటంతో ప్రతిరోజు వ్యాపారులు, దళాలురు పొలం వద్దకు వస్తున్నారు. ఎకరం పంటకు రూ. 3 లక్షల నుంచి రూ. 4లక్షల దాకా చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు.
- సూర్యనారాయణరెడ్డి, రాచువారిపల్లి

రక్తమోడిన రోడ్లు

● పండగ పూట ప్రమాదాలు
● ఆరుగురు మృతి.. తొమ్మిది మందికి గాయాలు
● బాధిత కుటుంబాల్లో విషాదం

7


గార్లదిన్నె వద్ద ఆర్టీసీ బస్సు కిందకు దూసుకుపోయిన కారు

వానొచ్చేస్తోంది..!

రానున్న ఐదు రోజుల్లో విస్తారంగా వర్షాలు


జమ్మానిపల్లిలో పొలంలోకి నీరు చేరడంతో రాగి పంట కోతకు ఇబ్బంది పడుతున్న కూలీలు

బుక్కరాయసముద్రం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త నారాయణస్వామి తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 30.2-31.2 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22.5-23.5 డిగ్రీల సెల్సియస్ నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. రానున్న ఐదు రోజుల్లో అనంతపురం జిల్లాలో 22న 10.1మి.మీ, 23న 23.2 మి.మీ, 24న 25మి.మీ, 25న మి.మీ 30, 26న20మి.మీ, వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 22న 22.3మి.మీ, 23న 20.5 మి.మీ, 24న 24.4మి.మీ, 25న 28.3మి.మీ, 26న 11.5మి. మీ, వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. వేరుశనగ పంట కోత చేపట్టే రైతులు వాయిదా వేసుకోవాలని సూచించారు.

నవంబరు 7 వరకు శనగ సాగు

ఉమ్మడి జిల్లాలో నవంబరు 7 వరకు శనగ పంట సాగు చేసుకోవచ్చని వాతావరణ శాస్త్రవేత్త నారాయణస్వామి తెలిపారు. రైతులకు సూచించారు. శనగలో అధిక దిగుబడి ఇచ్చే రకాలైన నంద్యాల గ్రామ1267, 776, 857,452, 49, ధీర47, జాకీ 9218 రకాల విత్తనం సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఎకరానికి 30 నుంచి 35 కేజీల విత్తనం వాడుకోవాలన్నారు. విత్తుకునే ముందు విత్తనశుద్ధి చేపట్టాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కందిని మారుకా మచ్చల పురుగు, పచ్చపురుగు ఆశించిందన్నారు. నివారణకు వ్యవసాయాధికారుల (మిగతా 7వ పేజీలో)

ఘనంగా బెస్తువర్ష్



పుట్టపర్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాలులో గుజరాతీయుల నూతన సంవత్సర వేడుక(బెస్తువర్ష్)లు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా దీపావళి ముగిసిన మరుసటి రోజుల ఈ వేడుకలు నిర్వహిస్తారు. గుజరాత్ భక్తులు మంగళవారం సాయంత్రం సత్యసాయి మహా సమాధిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు వేద పఠనంతో నూతన సంవత్సర వేడుకలను ప్రారంభించారు. సత్యసాయి ప్రేమతత్వంపై భక్తిగీతాలు ఆలపించారు. మానవ టూ మాధవ పేరిట సూరత్ బాలవికాస్ విద్యార్థులు నాటికను ప్రదర్శించా రు. బుద్ధుడు, సత్యసాయి, ఏసుక్రీస్తు తదితరులు మానవులుగా జన్మించి ఆ తర్వాత మాధవులుగా, అవతార పురుషులుగా కీర్తించబడ్డారని నాటిక ద్వారా తెలియజేశారు. చిన్నారులు తమ సంగీతం, నృత్యంతో భక్తులను అలరించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.


చిన్నారుల సాంస్కృతిక విన్యాసాలు

27న విగ్రహాల ఆవిష్కరణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని బేగార్లపల్లి వద్ద ఈనెల 27వ తేదీన బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. మడకశిర చరిత్రలో నిలిచిపోయేలా ఘనం గా నిర్వహిద్దామని కూటమి శ్రేణులకు పిలుపునిచ్చారు. తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే.. నియోజకవర్గంలోని మండలాల కన్వీనర్లు, ఎస్సీ సెల్ నాయకులు, ముఖ్య నేతలతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యక్రమానికి కోడుమూరు దస్తగిరి, విజయ్‌చంద్ర, మురళీ మోహన్, శ్రీనివాసరావు, జయసూర్య, శ్రీధర్, విజయ, శ్రావణి, నందిగామ సౌమ్య, వెంకటరాజు, కుమార్‌రాజవర్ల, సత్యనారాయణ, డాక్టర్ వీఎం థామస్, రామాంజనేయులు తదితర ఎమ్మెల్యేలు హాజరవుతున్నారన్నారు. సమన్వయంతో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, రాష్ట్ర ఒక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, నగర పంచాయతీ అధ్యక్షుడు నరసింహరాజు పాల్గొన్నారు.

వెండి చైను కోసమే హత్య

హత్యచేసింది మైనర్లు.. సహకరించింది మేజర్లు..!

7

కాటేసిన కరెంటు

వేర్వేరుచోట్ల విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి



ఫకీర్దీన్ మృతదేహం

రాప్తాడు/గుంతకల్లుటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరుచోట్ల ఇద్దరు విద్యుదాఘాతంతో మరణించారు. రాప్తాడు పరిధిలోని ఆటో నగర్‌లో వెల్డింగ్ కార్మికుడు షేక్ ఫకృద్దీన్ (55) కరెంటు కాటుకు బలయ్యాడు. రాప్తాడు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం నగరంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన ఫకృద్దీన్ వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఎక్కడ వెల్డింగ్ పని ఉంటే అక్కడికి వెళ్లి చేసేవాడు. ఆటోనగర్‌లో ఆటో మెబైల్ మెకానిక్ షాపుపైన రేకుల షెడ్డు వేయడానికి కూలీ మాట్లాడుకుని షేక్ ఫకృద్దీన్‌తోపాటు మరో వ్యక్తి జాఫర్ మంగళవారం వెళ్లాడు. ఆటో నగర్‌లో ఆటోమెబైల్ మెకానిక్ షాపు పైన డ్రిల్లింగ్ మిషన్‌తో రంధ్రాలు వేస్తుండగా.. విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఫకృద్దీన్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అతడి భార్య షాహిమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రాప్తాడు పోలీసులు తెలిపారు.

గుంతకల్లులో యువకుడు..



షేక్షావలి మృతదేహం

పట్టణంలోని పోర్టర్‌లైన్‌లో నివాసముంటున్న షేక్ షేక్షావలి (26) మంగళవారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోర్టల్ లైన్‌లో నివాసముంటున్న షేక్ ఖాజా వలి, హుసేన్ బీ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఖాజావలి, పెద్ద కుమారుడు షేక్షావలి బేల్దారి పనులకు వెళ్తుండేవారు. అందులో భాగంగా మంగళవారం తండ్రీకొడుకు పోర్టల్ లైన్‌లోనే రేకులు వేసే పనిచేస్తుండగా షేక్షావలికి కరెంట్ షాక్ తగిలి, పైనుంచి జారిపడ్డాడు. షేక్షావలి తల, చేతికి గాయాలయ్యాయి. అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. షేక్షావలికి ఫరీదాతో రెండేళ్ల క్రితం వివాహమైంది. పిల్లలు లేరు. ప్రమాదంపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

భూమాయపై విచారణ

ఉరవకొండ, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): బోగస్ పత్రాలు సృష్టించి, కోట్ల రూపాయల విలువ చేసే భూమిని కాజేసే యత్నంపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. వజ్రకరూరు తహసీల్దార్ నరేష్ మంగళవారం మీసేవ కేంద్రం నిర్వాహకుడు శ్రీనాథ్ గౌడ్‌ను తన కార్యాలయానికి పిలిపించుకుని, విచారణ నిర్వహించారు. మీసేవకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గతంలో పనిచేసిన డీటీ వాట్సా‌ప్‌కు పంపడంతో మ్యుటేషన్‌కు దరఖాస్తు చేశానని నిర్వాహకుడు తెలిపాడు. భూమికి, రైతుకు సంబంధం లేనపుడు ఎలా చేస్తారని మీసేవ నిర్వాహకుడిని తహసీల్దార్ ప్రశ్నించారు. ఈ ఘటనపై నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

వివాదాల డీటీ..!

శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) ఆది నుంచీ వివాదాస్పదమే. వైసీపీ పాలనలో ఫోర్జరీ సంతకాలతో రూ.కోట్ల విలువచేసే భూమికి, నకిలీ ఎన్‌వోసీలు జారీచేసిన ఘటనల్లో నిందితుడిగా ఉన్నారు. తాజాగా బోగస్ పత్రాలు సృష్టించి, మీసేవ కేంద్రం ద్వారా రూ.52 కోట్ల విలువైన భూమిని కాజేయాలని డీటీ కుట్ర పన్నినట్లు వెలుగులోకి వచ్చింది. అనంతపురం రూరల్ మండలంలోని ఉప్పరపల్లిలో పసులూరి రమేష్‌తోపాటు, అతడి తమ్ముళ్లు, అక్కాచెల్లెళ్లకు 13.18 ఎకరాలు వచ్చింది. ఆ భూమిని కాజేయడానికి తాడిపత్రికి చెందిన పసులూరి అనే ఇంటి పేరుతో ఉన్న రుషింగమయ్య అనే వ్యక్తి పేరుతో మీసేవ కేంద్రం నుంచి మ్యుటేషన్‌కు దరఖాస్తు చేశారు. ఈ విషయం భూ యజమానులకు సెల్‌ఫోన్ ద్వారా సమాచారం వెళ్లడంతో అప్రమత్తమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై అనంతపురం రూరల్ తహసీల్దార్.. బాధిత రైతులను పిలిపించి, విచారించారు. బోగస్ పత్రాలు సృష్టించి, భూమిని కాజేయాలని ప్రయత్నించిన అధికారి, మీసేవ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అందులో భాగంగా తహసీల్దార్ విచారణ చేపట్టారు.

ప్లేస్‌మెంట్ ఉత్తర్వులు జారీ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగోన్నతి ప్లేస్‌మెంట్ ఉత్తర్వులు జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి మంగళవారం జారీ అయ్యాయి. గ్రేడ్-5 కార్యదర్శులకు గ్రేడ్-4 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పించారు. రెండు వారాల క్రితం కౌన్సెలింగ్ నిర్వహించి, ఆప్షన్ ఫామ్స్ స్వీకరించారు. కానీ ఉత్తర్వులు ఇవ్వడంలో జాప్యం జరిగింది. కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు డీపీఓ నాగరాజనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉద్యోగోన్నతి పొందిన 150 మంది హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థిని అదృశ్యం



పి. అక్షిత

రాప్తాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పంగల్ రోడ్డు సమీపంలోని విన్సెంట్ డీపాల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థిని పి.అక్షిత అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పంగల్ రోడ్డులో నివాసం ఉంటున్న శివప్రసాద్ కూతురు అక్షిత 7వ తరగతి చదువుతోంది. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లి, సాయంత్రం ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పాఠశాలలో వెతికినా కనబడలేదు. అక్షిత బ్లూ అండ్ వైట్ చెక్స్ టాప్, బ్లూ కలర్ ప్యాంట్ వేసుకుందని, ఆచూకీ తెలిసిన 9440796817 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీహర్ష కోరారు.

వెండి చైను కోసమే హత్య

హత్య చేసింది మైనర్లు... సహకరించింది మేజర్లు

హత్యకేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

హిందూపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మెడలోని వెండిచైను, బైక్ కోసమే వ్యక్తిని హత్య చేశారని డీఎస్పీ మహేష్ పేర్కొన్నారు. అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ వద్ద హత్య కేసు వివరాలను డీఎస్పీ విలేకరులకు మంగళవారం వెల్లడించారు. ఈనెల 12న హిందూపురం మండలం సంతేబిదునూరు వద్ద కర్ణాటక రాష్ట్రం గౌరీబిదనూరుకు చెందిన యువకుడు పవన్‌కుమార్‌ను హత్యచేసి ఆపై మొహంపై పెట్రోల్ పోసి ప్లాస్టిక్ బాటిల్ వేసి కాల్చారు. అయితే మరుసటి రోజు అటుగా వెళ్లేవారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించారు. వీరిని మంగళవారం అనుమేపల్లి సమీపంలో ఉన్న హంద్రీనీవా కాలువ వద్ద అరెస్ట్ చేశారు. విచారణలో హత్యచేసింది అనుమేపల్లికి చెందిన ఇద్దరు మైనర్లని తెలిసింది. సంతేబిదునూరు సమీపంలో ఉన్న కల్లుదుకాణం వద్దకు గౌరీబిదనూరుకు చెందిన పవన్‌కుమార్ తరచూ వచ్చి వెళ్లే వాడు. అతడి వద్ద డబ్బులున్నాయని మైనర్లు భావించారు. దీంతో ఎలాగైనా ఆ డబ్బు లాక్కోవాలని ప్లాన్ వేశారు. ఆన్‌లైన్‌లో ఇనుప సేఫ్టీరాడ్‌ను తెప్పించారు. అనుకున్న ప్లాన్ ప్రకారం ఈనెల 12న పవన్‌కుమార్‌ను కల్లుతాగుదామని నమ్మించి కొంతదూరానికి తీసుకెళ్లి అతడి వద్ద వెండి చైను, రూ.2500 లాక్కున్నారు. ఆయన తిరగబడటంతో ఐరన్‌రాడ్‌తో తలపై కొట్టి, అక్కడే ఉన్న బీరుబాటిల్‌తో కడుపులో పొడిచి చంపారు. ఆ తరువాత వారి స్నేహితులైన పి. అంజనేయులు అలియాస్ అంజి, అలియాస్ కుంటిపిచ్చి, సంతేబిదునూరులో నివాసమున్న కర్ణాటక వాసి ఆకాష్ అలియాస్ శెనక్కాయలు సలహా తీసుకుని పవన్‌కుమార్ మృతదేహంపై ప్లాస్టిక్ బాటిళ్లు, కట్టెలువేసి పెట్రోల్‌పోసి నిప్పంటించారు. హత్యకేసును త్వరగా ఛేదించిన సీఐ ఆంజనేయులు, సీఐ జనార్దన్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీం ఉన్నారు.

వానొచ్చేస్తోంది..!



ముత్యాల చెరువు నుంచి వస్తున్న వరద నీరు



తిమ్మాపురం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు



మణూరు గ్రామం వద్ద ప్రవహిస్తున్న వంక

(5వ పేజీ తరువాయి)

సలహామేరకు రసాయన, పురుగు మందులు వాడుకోవాలన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వర్షం కురిసింది. అనంతపురం, బెళుగుప్ప, గుత్తి, విడపనకల్లు, గార్లదిన్నె, శెట్టూరు, నార్పల, పామిడి మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. కూడేరు, రాయదుర్గం, గుంతకల్లు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

ముత్యాలచెరువుకు మరువ

పెనుకొండరూరల్: పెనుకొండ మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలు గ్రామాల్లో సాగుచేసిన పంటలు నీట మునిగాయి. ముత్యాల చెరువుకు భారీగా వరద నీరురావడంతో మరువ ఉధృతంగా ప్రవహించి మరువనీరు పాత జాతీయ రహదారిపై ప్రవహించాయి. పెనుకొండ నుంచి కియవైపు వెళ్లే వాహనాలకు స్వల్ప అంతరాయం ఏర్పడింది.

పొంగిపొర్లిన వాగులు, వంకలు

మడకశిర రూరల్: మడకశిర ప్రాంతంలో సోమవారం రాత్రి భారీగా వర్షం కురిసింది. మడకశిర మండలంలో 56.8 మిల్లీ మీటర్లు, అగళి 58.6 మి.మీ, రొళ్ల 50.4మి.మీ, గుండిబండ 14.10 మి.మీ, అమరాపురం 10 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మడకశిర మండల వ్యాప్తంగా వంకలు, వాగులు పొంగిపొర్లాయి. చెక్ డ్యాంలు, కుంటలు నిండాయి. కోతకు వచ్చిన రాగి, మిరప పొలాల్లోకి నీరు చేరడంతో పంట కోతకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హరేసముద్రం, చందకచర్ల, మణూరు గౌడనహళ్లి పంచాయతీ పరిధిలో వాగులు ఉధృతంగా ప్రవహించాయి.

బీటీపీకి ఇన్‌ఫ్లో

గుమ్మఘట్ట: మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్టుకు వరదనీటి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. కర్ణాటక ప్రాంతాల్లో గత రెండురోజులుగా భారీ వర్షాలు కురవడంతో వాణి విలాసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి మరువపారుతోంది. దీంతో వేదవతి నదికి, ఆపై బీటీపీ ప్రాజెక్టుకు రెండువేల క్యూసెక్కుల వరదనీరు చేరుతోంది. ప్రస్తుతం బీటీపీలో 1655 అడుగులకు నీరు చేరినట్లు అధికారులు పేర్కొన్నారు. వరదనీటి ప్రవాహం వేదవతి హగరిలో మరో నెలరోజుల పాటు కొనసాగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. బీటీపీకి పూర్తిస్థాయి నీరు చేరితే కుడికాలువ కింద 16 వేల ఎకరాలు, ఎడమ కాలువ కింద మూడు వేల ఎకరాలు సాగయ్యే అవకాశం ఉంది.

ఆదుకుంటామని మోసం

మోసగాళ్ల వలలో ఓ యువకుడు

నల్లచెరువు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు ఓ ఫౌండేషన్ పేరుతో మోసం చేసి డబ్బు కాజేసిన ఘటన మండలంలోని గొల్లపల్లి గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా... గొల్లపల్లి గ్రామానికి చెందిన యువకుడు కె.బయప్ప ఇన్‌స్టాగ్రామ్‌లో హర్షసాయి ఫౌండేష్ పేరు మీద ప్రకటన చూసి వారి కుటుంబంలోని నానమ్మ అనారోగ్యానికి గురికావడంతో ఆర్థిక సాయం కోసం ఆ ఫౌండేషన్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్ రూపంలో అభ్యర్థించారు. దీన్ని అసరాగా తీసుకున్న కొందరు సైబర్ నేరగాళ్లు ఫౌండేషన్‌కు ఫీజు చెల్లిస్తే రూ. 3.5 లక్షలు మీ అకౌంట్‌కు వేస్తామని నమ్మబలికారు. మొదటగా రూ.2వేలు వేసిన తరువాత ఫౌండేషన్ నిర్వాహకులు రూ. 2వేలు కాకుండా బాధితుడిని అకౌంట్‌లో రూ. 50 వేల రూపాయలు ఉంటే అమౌంట్ క్రెడిట్ అవుతుందని నమ్మబలికారు. అలా నమ్మబలికి తరవాత అకౌంట్‌లో ఉన్న రూ. 50వేలు కూడా ట్రాన్స్‌ఫర్ చేస్తే రూ.3.50 మీ అకౌంట్‌లో వేస్తామన్నారు. అలా నాలుగురోజుల వ్యవధిలో రూ. 1.85లక్షలు ఫౌండేషన్ అకౌంట్‌కి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. డబ్బుల కోసం బాధితుడు నిలదీయడంతో బెంగళూరు శివారు యలహంక దగ్గరకు రమ్మన్నారు. ఆమేరకు బయప్ప యలహంకకు వెళ్లి వారికి ఫోన్ చేయగా గంటలో వస్తామని చెప్పి సాయంత్రం కూడా రాలేదు. దీంతో బాధితుడు అక్కడే ఉన్న తన స్నేహితుల సాయంతో కర్ణాటకలోని యలహంక సైబర్ క్రైమ్‌వారికి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు సైబర్‌క్రైమ్ వారు ఫౌండేషన్ వారి అకౌంట్ హోల్డ్‌లో ఉంచామని, మీ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఒకసారి వెళ్లి కలవమన్నారు. ఈ విషయంపై ఎస్సై మక్బుల్ బాషాను వివరణ కోరాగా జరిగిన సంఘటన వాస్తవమేననీ, ఎవరూ కూడా అత్యాశకు పోయి సోషల్‌మీడియాలో ఫౌండేషన్ మీద వచ్చే ఇలాంటి వాటిని నమ్మవద్దన్నారు. ఈ సంఘటనను విచారిస్తామని బాధితుడుకి తెలిపారు.

కల్లితండాలో అమరవీరుల దినం



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పోలీసులు, కుటుంబీకులు

హిందూపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కల్లితండాలో పోలీసు అమరవీరుల దినాన్ని నిర్వహించారు. గోరంట్ల సీఐ శేఖర్, ఎస్ఐ రామచంద్ర, ఉమాదేవి, సిబ్బంది తదితరులు ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన వీరజవాన్ మురళీనాయక్ సమాధివద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఐ శేఖర్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరజవాన్ మురళీనాయక్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీరజవాన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ క్రీడలకు ఏర్పాట్లు చేయండి

కలెక్టర్లు ఆనంద్, శ్యాంప్రసాద్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నవంబరు 7, 8, 9తేదీల్లో నిర్వహించే 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు-2025కు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో కలిసి సమన్వయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. క్రీడలలో పాల్గొనేవారికి వసతి, భోజనం, ఇతర ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఏ ఏ జిల్లాల నుంచి ఎవరెవరు వస్తారో ముందుగానే తెలుసుకోవాలని సూచించారు. డయాస్, ప్రొటోకాల్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల అధికారులు సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. సమష్టి కృషితో క్రీడలను విజయవంతం చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ సూచించారు. రెవెన్యూ క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చే ఉద్యోగులకు సాధ్యమైనంతవరకూ రాయలసీమ వంటలను వడ్డించాలని సూచించారు. వసతి నుంచి క్రీడలు జరిగే ఆర్డీటీ స్టేడియానికి రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతనాయుడు, శ్రీనివాస్, మహేష్, వీవీఎస్ శర్మ, సువర్ణ, ఆనంద్ కుమార్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దివాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడిన రోడ్లు

పండగ పూట ప్రమాదాలు

ఆరుగురు మృతి.. తొమ్మిది మందికి గాయాలు


బాధిత కుటుంబాల్లో విషాదం

రామగిరి/ఓబుళదేవరచెరువు/హిందూపురం/ముదిగుబ్బ/గార్లదిన్నె, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్లు రక్తమోడాయి. పండగపూట వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మరణించగా.. తొమ్మిది మంది గాయపడ్డారు. ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వారి కుటుంబీకులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

దైవదర్శనానికి వెళ్లొస్తూ..



చంద్రశేఖర్(ఫైల్)



రామలింగ (ఫైల్)

రామగిరి మండలం పేరూరు సమీపాన మంగళవారం బైక్‌ను ట్రాక్టర్ ట్రాలీ తగలడంతో పెండ్లిజీవి కురుబ చంద్రశేఖర్ (57), కురుబ మల్లెల రామలింగ (54) మృతిచెందారు. కనగానపల్లి మండలం వేపకుంట గ్రామానికి చెందిన వీరు టీడీపీ సానుభూతిపరులు, బంధువులు కూడా. దీపావళి పండుగ సందర్భంగా రామగిరి మండలంలోని పాపిరెడ్డిపల్లి సమీపాన గల అక్కమ్మగార్ల దర్శనానికి వచ్చారు. దైవదర్శనం చేసుకుని తిరిగి స్వగ్రామానికి బైక్‌లో బయల్దేరారు. పేరూరు సమీపంలో వెళ్తుండగా.. వెనుక నుంచి ట్రాక్టర్ ఓవర్ టేక్ చేయబోయి ట్రాలీ తగిలింది. దీంతో బైక్‌లోని ఇద్దరు ట్రాలీ టైర్ల కిందపడ్డారు. ఆ ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. చంద్రశేఖర్‌కు ఇద్దరు కుమారులు మారుతి, సుబ్రహ్మణ్యం ఉన్నారు. రామలింగకు భార్య వసంతమ్మ, కుమారులు సోము, సాంబ ఉన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సుధాకర్ యాదవ్ తెలిపారు.

కూతురిని చూసి వస్తూ..



సాలెమ్మ (ఫైల్)

పండుగ రోజు కుమార్తెను పలకరించి వెనుదిరిగి వస్తున్న వృద్ధురాలిని రోడ్డు ప్రమాదం కబళించింది. ఓబుళదేవరచెరువు సమీపంలోని రెయిన్ బో పాఠశాల వద్ద సోమవారం బైక్‌ను వెనుక నుంచి మరో ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో దాదిరెడ్డి సాలెమ్మ (80) మృతి చెందింది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దాదిరెడ్డిపల్లిలో సాలెమ్మ నివాసం ఉండేవారు. మండలంలోని నారప్పగారిపల్లిలో ఉంటున్న కుమార్తె లక్ష్మీనరసమ్మ వద్దకు పండుగ రోజు వెళ్లింది. కుమార్తెను పలకించి అల్లుడు శ్రీనివాసులుతో కలిసి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయల్దేరింది. రైయిన్‌బో పాఠశాల వద్ద సాలెమ్మ వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి మరో బైక్‌పై వస్తున్న గణేష్ ఢీకొట్టాడు. ప్రమాదంలో సాలెమ్మ, ఆమె అల్లుడు గాయపడ్డారు. సాలెమ్మను 108 వాహనంలో కదిరికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.


అమ్మ వద్దకెళ్తూ.. చిన్నారి..



మెహతాజ్ (ఫైల్)

పుట్టింట్లో ఉన్న అమ్మను చూడడానికి బయల్దేరిన చిన్నారిని రోడ్డు ప్రమాదం బలిగొంది. గోరంట్ల మండలం మల్లాపల్లి వద్ద సోమవారం ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో మెహతాజ్ (11) అనే చిన్నారి మృతిచెందగా.. నలుగురు గాయపడ్డారు. గోరంట్ల సీఐ శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోరంట్లకు చెందిన ఖలందర్ భార్య ఆయిషా సొంత ఊరైన పెనుకొండకు వెళ్లింది. తామే వస్తామని ఆయిషా చెప్పినా వినకుండా.. ఖలందర్ కుమార్తె మెహతాజ్‌తో కలిసి తన ఆటోలో పెనుకొండకు బయల్దేరాడు. దారిలో ప్యాసింజర్లను కూడా ఎక్కించుకున్నాడు. మల్లాపల్లి సమీపాన ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో మెహతాజ్‌తోపాటు పాలసముద్రానికి చెందిన రామక్క, వెంకటేశ్, శాంతమ్మ గాయపడ్డారు. ద్విచక్రవాహనంలో వెళ్తున్న చిలమత్తూరు మండలం బండ్లపల్లికి చెందిన గంగిరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన చిన్నారి మెహతాజ్‌ను బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కుమార్తె మృతితో తీవ్ర ఆవేదన చెందిన ఖలందర్ సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సోషల్ మీడియా ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేయగా.. కదిరిలో ఉన్న ఖలందర్‌ను గుర్తించి మంగళవారం ఉదయం గోరంట్లకు తీసుకొచ్చారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు గోరంట్ల సీఐ శేఖర్ తెలిపారు.

బైక్‌ను ఎక్స్‌కవేటర్ ఢీకొని ఇద్దరు..



చెన్నకృష్ణ (ఫైల్)



శేషయ్య (ఫైల్)

ముదిగుబ్బ మండలం గుంజేపల్లి చెరువుకట్ట సమీంలో సోమవారం రాత్రి బైక్‌ను ఎక్స్‌కవేటర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. ఒకరు గాయపడ్డారు. ముదిగుబ్బ సీఐ శివరాముడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుక్కపట్నం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన శేషయ్య(59), చెన్నకృష్ణ(55), మోహన్ ద్విచక్రవాహనంలో ముదిగుబ్బకు వచ్చి తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. గుంజేపల్లి చెరువు కట్ట వద్ద ఎదురుగా వస్తున్న ఎక్స్‌కవేటర్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన చెన్నకృష్ణ, శేషయ్య అక్కడికక్కడే మృతిచెందారు. మోహన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చెన్నకృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. స్వగ్రామంలో వ్యవసాయ పరికరాలు బాడుగకు ఇచ్చుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. శేషయ్యకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. స్వగ్రామంలో వేరుశనగ కాయల వ్యాపారం చేస్తుండేవాడు. మోహన్‌ను బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు. ఇద్దరి మృతితో కృష్ణాపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు



ఆర్టీసీ బస్సు కిందకు దూసుకుపోయిన కారు

గార్లదిన్నె మండలం కనుంపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న గుత్తి డిపోకి చెందిన ఆర్టీసీ బస్సును వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ముగ్గురు గాయపడ్డారు. బస్సు వెనుక భాగంలోకి కారు దూసుకెళ్లి ఇరుక్కుపోయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఉదయ్ వర్మ స్వల్పంగా గాయపడ్డాడు. వృద్ధుడు, మహిళ తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కారులో ముగ్గురు బయల్దేరారు. కనుంపల్లి బస్సును ఢీకొట్టడంతో ముగ్గురూ గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్ గౌస్‌బాషా ప్రమాద స్థలానికి చేరుకున్నారు. కారులో ఇరుక్కుపోయిన ముగ్గురిని బయటకు తీశారు. వారిని ఆస్పత్రికి తరలించేందుకు 108 వాహనం రావడం ఆలస్యం కావడంతో రహదారిపై వెళ్తున్న వాహనాల్లో క్షతగాత్రులను ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా తరలించారు.

ఎన్‌టీఏ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

అనంతపురం విద్య, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఎన్‌జీఓ హోమ్‌లో సోమవారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర నాయకుడు శివశంకర్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా పతకమూరి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్.రవి, జిల్లా కోశాధికారిగా ఎం.వెంకటేశులు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా వరలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రేపు సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 23వ తేదీన ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తామని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గాయత్రి, గంగమ్మ తెలిపారు. సీనియర్ పురుషులు, మహిళల విభాగంలో ఎంపిక పోటీలు ఉంటాయని, ఎంపికైన క్రీడాకారులు నవంబరు 8, 9 తేదీలలో గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 7989017210 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

నాటు తుపాకీ స్వాధీనం

బుక్కపట్నం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. వీరు గూనిపల్లి అటవీ ప్రాంతం, గుట్టల్లో సంచరిస్తుండగా పట్టుకున్నట్లు సమాచారం. వీరిని పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయానికి తరలించి, విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం తమ దృష్టికి రాలేదని ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

న్యూస్ బాక్స్

కాలభైరవుడి ఆలయంలో అమావాస్య పూజలు

ధర్మవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చక్రవర్తి థియేటర్ సమీపంలో ఉన్న కాలభైరవస్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమావాస్య ఘడియల్లో ఆలయ పూజారి ధనుంజయ ఆచారి ఆధ్వర్యంలో దోషనివారణ పూజలు చేశారు. కూష్మాండ దీపోత్సవాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయం ఎదుట గుమ్మడికాయపై దీపాలు వెలిగించారు.

జేసీని కలిసిన మార్కెట్ యార్డ్ చైర్మన్

కొత్తచెరువు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మౌర్యభరద్వాజ్‌ను పుట్టపర్తి మార్కెట్‌యార్డ్ చైర్మన్ పూలశివప్రసాద్ మంగళవారం కలిసి సన్మానించారు. వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో కోల్డ్‌స్టోరేజ్ గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, ప్రభుత్వం ద్వారా ఎఫ్‌పీఓఎస్‌కి సబ్సిడీలు అందేలా కృషిచేయాలని కోరామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పుట్టపర్తి కన్వీనర్ సుబ్బారావు, జనరల్ సెక్రటరీ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త ఆత్మహత్య



రాము (ఫైల్)

బుక్కపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జానకంపల్లి సమీపంలో హంద్రీనీవా కాలువ వద్ద మంగళవారం అమగొండపాళెం రాము(37) అనే టీడీపీ కార్యకర్త చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు పుట్టపర్తిలో కడ్డీల పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కుటుంబ సమస్యలు తీవ్రతరం కావడంతో తాగుడుకు బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు, ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడి కేసులో ఐదుగురి అరెస్టు

కొత్తచెరువు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుకుంటపల్లి వద్ద ఈనెల 20న నీరుగంటి అంజనేయులపై దాడికి పాల్పడిన ఐదుగురిని అరెస్టు చేసినట్లు కొత్తచెరువు సీఐ మారుతీశంకర్ తెలిపారు. పెనుకొండ మండలం మునిమడుగు గ్రామానికి చెందిన నీరుగంటి అంజనేయులుపై ఐదుగురు నిందితులు హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. ఈ నెల 20న మరుకుం టపల్లి వద్ద రాళ్లతో దాడి చేయగా అంజనేయులు స్పృహ తప్పి పడిపోయాడని, దీంతో అతడు చనిపోయాడని అనుకుని వారు వెళ్లి పోయారన్నారు. నీరుగంటి అంజనేయులు ఫిర్యాదు మేరకు దాసరి వెంకట నారాయణ, తలారిచిరంజీవి, తలారి పోతలయ్య, బొగ్గు మహేంద్ర, వంశీపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశామన్నారు. ఐదుగురిని ఆదివారం కొత్తచెరువు మార్కెట్‌యార్డ్ వద్ద అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రెండు ద్విచక్రవాహనాలు, ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని కోర్టుకు హాజరు పరిచామని సీఐ తెలిపారు.

హాస్టల్ వద్ద ప్రైవేటు వాహనాలు వద్దు

● అధికారులకు ఎమ్మెల్యే కందికుంట ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న బాలికల హాస్టల్ సమీపంలో ప్రైవేటు కార్లు, ట్యాక్సీలను నిలుపకుండా ఆర్టీ డిపో ఆవరణంలో అద్దె వాహనాల స్టాండ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బాలికల ఉన్నత పాఠశాల, హాస్టల్ వద్ద ప్రైవేటు ట్యాక్సీ లు ఉండటం వల్ల బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తహసీ ల్దార్ కార్యాలయం ఆవరణంలో ఉన్న కార్యాలయాలకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పట్టణానికి నలువైపులా కూరగాయలు అందుబాటులో ఉండే విధంగా చిన్నపాటి మార్కెట్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం కూ రగాయల మార్కెట్ వెనుక ఉన్న జంతువధశాలను పట్టణానికి దూరంగా తరలించాలని అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతల సమస్యలు తెత్తకుండా పోలీసు అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, పట్టణ సీఐ నారాయణరెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ మైనుద్దీన్, ఎంఈఓ చెన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

బత్తలపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సమీపంలో టో ల్ గేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓబన్న(60) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపా డు. గార్లదిన్నె మండలం పాత కల్లూరుకు చెందిన ఓబన్న గత నెల 10న టోల్ గేట్ వద్ద ద్విచక్రవాహనం ఢీ కొని గాయపడ్డాడు. అప్పటి నుంచి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు . అతడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

ధర్మవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చిరంజీవి అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. సీఐ తెలిపిన మేరకు... ఈనెల 18న కడుపు నొప్పి తీవ్రంగా ఉందని ఓ బాలిక తల్లికి చెప్పడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో ఆ బాలిక మృత శిశువుకు జన్మనిచ్చింది. దీనిపై తల్లిదండ్రులు, పోలీసులు అడగ్గా... చిరంజీవి అందుకు కారణమని తెలిపింది. తల్లి పనికెళ్లినపుడు ఇంట్లో ఒంటరిగా ఉన్న తనకు మాయమాటలు చెప్పి అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపింది. బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. చిరంజీవిపై పోక్సో కేసు నమోదు చేసుకుని, విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పోలీసు అమరవీరులకు నివాళి



అమరవీరుల స్తూపం వద్ద సెల్యూట్ చేస్తున్న సీఐలు, ఎస్ఐ, సిబ్బంది

ధర్మవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల ఆశయాల స్ఫూర్తితో పునరంకితమవుదామని వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి వారు సెల్యూట్ చేశారు. అనంతరం సిబ్బంది, విద్యార్థుల చేత అమరవీరుల స్థూపానికి పూలమాల వేయించి, రెండు నిమిషాలు మౌనంపాటించారు. ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల ఆవరణంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో సిబ్బంది తదితరులు రక్తదానం చేశారు. రక్తబంధం ట్రస్టు వ్యవస్థాపకులు కన్నా వెంకటేశ్, సభ్యులు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి మంత్రి అండ: హరీశ్‌బాబు

తాడిమర్రి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఎల్లప్పుడూ అండగా ఉంటారని పట్టణంలోని మంత్రి కార్యాలయ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు పేర్కొ న్నారు. సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో గత నెల 25న పిన్నదరి గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో అదే గ్రామానికి చెందిన సాకే విఘ్నేష్ (3) అనే బాలుడు అత్యవసర గుండె శస్త్రచికిత్సకు ఎంపికయ్యాడు. మంత్రి చొరవతో తిరుపతిలోని పద్మావతి చిల్డ్రన్ హార్ట్‌కేర్ సెంటర్‌లో శస్త్రచికిత్స నిర్వహించారు. చిన్నారి పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ కావడంతో కూటమినాయకులు పిన్నదరి గ్రామంలో చిన్నారిని పరామర్శించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాము తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బొలెరో వాహనం

బత్తలపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి క్రాస్‌లో మంగళవారం ఆటోను బొలెరో వాహనం ఢీ కొని ఇద్దరు గాయపడినట్లు ఎస్ఐ సోమశఖర్ తెలిపారు. చెర్లోపల్లికి చెందిన రమేష్, బళ్ళారికి చెందిన నాగరాజు బత్తలపల్లి వైపు నుంచి ఆటోలో చెర్లోపల్లికి వెళ్తున్నారు. కదిరి వైపు నుంచి బత్తలపల్లి వైపు వెళ్తున్న బొలేరో డి.చెర్లోపల్లి క్రాస్ వద్ద ఢీ కొనడంతో రమేష్, నాగరాజు గాయపడ్డారు. బీజేపీ నాయకుడు నారాయణ స్వామి తన వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట ఆడుతున్న 11 మంది అరెస్ట్

తాడిమర్రి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాడితోట గ్రామ శివారులో సోమవారం పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ క్రిష్ణవేణి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.47,750 నగదు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు.

ఘర్షణపై కేసు

గాండ్లపెంట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మలమీదపల్లి పంచాయతీ కరణంవారిపల్లికి చెందిన దేరంగుల డానీ, కోటూరుకు చెందిన జయప్ప మలమీదలపల్లిలో ఓ దుకాణం వద్ద ఓ విషయంలో గొడవపడ్డారు. ఈ క్రమంలో జయప్ప రాయితో కొట్టడంతో డానీ తలకు తీవ్రరక్త స్రావం జరిగింది. అతడికి కదిరి ప్రభుత్వ ఆసుప్రతిలో చికిత్స చేయించారు. డానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తిరుమలరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కదిరి అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రదొడ్డి టోల్ గేట్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కదిరి మండలం యర్రదొడ్డికి చెందిన సుదర్శన్ బైక్ లో కదిరి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. తమిళనాడులోని సేలం ప్రాంతానికి చెందిన కన్నన్ బైకులో కదిరి వైపు వస్తున్నాడు. టోల్ గేట్ వద్ద ఆ బైకులు ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనం ద్వారా కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

ఫిర్యాదిదారులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు: ఎస్పీ

బత్తలపల్లి/ధర్మవరం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఎస్పీ అకస్మిక తనిఖీ చేశారు. రి కార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. రాబో యే స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. ఆవరణలో మొక్కలు నాటారు. సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్, ఏఎస్ఐ నాగప్రసన్న తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎస్పీ ధర్మవరం పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం రాత్రి అకస్మికంగా తనిఖీ చేశారు.

డీఏ జీఓలను సవరించాలి

● యూటీఎఫ్, ఎస్టీయూ నాయకుల డిమాండ్

ధర్మవరం/నంబులపూలకుంట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ ఇటీవల జారీ చేసిన జీఓలు 60, 61లను సవరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి రామకృష్ణనాయక్ డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. యూటీఎఫ్ నాయకులు జింకా హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రాష్ట్ర ఆర్థిక శాఖ జారీ చేసిన డీఏ జీఓలు అసంబద్ధంగా ఉన్నాయని, వాటిని సవరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో మంగళ వారం ఆ ఉపాధ్యాయ సంఘం సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు హరిప్రసాద్ పాల్గొన్నారు.

నీ రాజకీయ సమాధికి ప్రజలు సిద్ధం

● కేతిరెడ్డిపై బీజేపీ నాయకుల మండిపాటు

ధర్మవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నీ బెదిరింపులు, దౌర్జన్యాలు అక్రమాలకు చెక్ పెట్టాలనే ప్రజలు గత ఎన్నికలలో గుణపాఠం చెప్పారని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామి రెడ్డిపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ఇప్పుడు 3.0 అంటూ బెదిరింపులకు గురిచేస్తున్నావని, ప్రజలు రాజకీయ సమాధి కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్టాడారు. అలాగే రాష్ట్రంలోనే కాకుండా అటు పార్టీ పరంగా, రాజకీయ పరంగా గుర్తింపు ఉన్న మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను సత్య అంటూ సంబోధించడం ఆయన రాజకీయ అవివేకానికి నిదర్శనమన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబుళేశు, పట్టణ, రూరల్ అధ్యక్షుడు జింకా చంద్ర, గొట్లూరు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యం

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

మడకశిరటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమం, వారి ఆరోగ్య పరిరక్షణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 26 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేకంగా దృష్టి పెట్టడం ప్రభుత్వ ఆస్పత్రులను సైతం అవసరమైన పరికరాలను సమకూరుస్తూ అన్ని వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. దీంతో పాటు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా అనారోగ్యంతో బాధపడేవారు చికిత్స చేయించుకొన్న అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వారిని ఆర్థికంగా ఆదుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం 26 మందికి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ దిష్టిబొమ్మ దహనం



ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సుంకాలకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ దిష్టిబొమ్మను సీఐటీయూ నాయకులు దహనం చేశారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌వద్ద ట్రంప్ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన అనంతరం నాయకులు మాట్లాడారు. ట్రంప్ ప్రారంభించిన వాణిజ్యయుద్ధం భారతదేశంతోసహా ప్రపంచ దేశాలపై తీవ్ర ప్రభావం చూపనుందన్నారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేవిధంగా ఉందన్నారు. ఆర్థిక సంక్షోభం తీవ్రతరం కానుందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొని మనదేశ ప్రయోజనాలు కాపాడుకునేలా ప్రత్యామ్నాయ విధానాలు అందిపుచ్చుకోవాల్సిన బీజేపీ ప్రభుత్వం ట్రంప్‌నకు అడుగడుగునా మడుగులొత్తే లొంగుబాటు వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. ఇప్పటికైనా ట్రంప్ ఎత్తుగడులను గ్రహించి అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజలంతా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, సీఐటీయూ కన్వీనర్ బాబావలి, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి గంగాధర్, నారాయణ, అంజినప్ప, కిష్టప్ప, నరసింహ, బాషా తదితరులు పాల్గొన్నారు.

లే అవుట్లను క్రమబద్ధీకరించుకోండి

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కమిషనర్

హిందూపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని లేవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున అన్నారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో అనధికారికంగా వేసిన లేఅవుట్లను ఈనెల 23వరకు క్రమబద్ధీకరించుకునేందుకు గడువు ఉందన్నారు. ఆలోపే ఎల్‌ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 300దాకా అనధికార లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటి వరకు ఎల్‌ఆర్ఎస్ కోసం 56 దరఖాస్తులు వచ్చాయన్నారు. మిగిలినవారు ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోలేదన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు అన్ని ఫీజులు చెల్లిస్తే 10శాతం రాయితీ, ఓపెన్‌స్పేస్ సీఎల్‌యు చార్జీలు వర్తించవన్నారు. అలా క్రమబద్ధీకరించుకోని పక్షంలో అలాంటి లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతులు ఇవ్వడం కుదరదన్నారు. ఆపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏసీబీ చంద్రమ్మ, డీపీఓ అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

పరిగి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి పొందకుండా రాత్రి సమయాల్లో పరిగి, శ్రీరంగరాజులపల్లి జయమంగళి నది వద్ద ఇసుకను కర్ణాటక ప్రాంతానికి తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. అందిన సమాచారం మేరకు దాడిచేసి పట్టుకోవడం జరిగిందని ఎస్ఐ రంగడు తెలిపారు. ప్రభుత్వ అనుమతి పొంది ఇసుకను తరలించుకోవాలన్నారు. అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డివిజన్ స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న టోర్నీ నిర్వాహకులు

పెనుకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో డివిజన్‌స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వాలీబాల్ టర్నీ ప్రారంభమైంది. డివిజన్‌లోని 13 మండలాలకు ఎంపికైన బాల బాలికల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. టోర్నీకి హెచ్ఎం రాఘవయ్య కన్వీనర్‌గా వ్యాయామ ఉపాధ్యాయుడు నాగభూషణం కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను జిల్లాస్థాయి జట్టుకు ఎన్నుకోవడం జరుగుతుందని వారు తెలిపారు.

అభివృద్ధి వైపు అడుగులు పడేనా..?

వైసీపీ హయాంలో ఆగిన పనులు

చైర్మన్ మార్పుతో గాడిలో పడేనా..?



మారుతీ నగర్‌లో రోడ్డు దుస్థితి

మడకశిర టౌన్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ అభివృద్ధివైపు అడుగులు పడేనా అన్న చర్చ పట్టణంలో సాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆగిన అభివృద్ధి నగరపంచాయతీ పీఠం టీడీపీ కైవసం చేసుకోవడంతో గాడిలో పడేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. వైసీపీ హయాంలో ఇంటి నిర్మాణం, కాలనీలో అభివృద్ధి పనులు జరగాలన్నా ముడుపులు ముట్టచెప్పక తప్పేదికాదని అంటున్నారు. ఒక వైపు ఇసుక కొరత మరో వైపు ముడుపులు ముట్ట చెప్పలేక చివరకు ఇంటి నిర్మాణాలు ఆగిపోయాయి. మారుతీనగర్, ఆదిరెడ్డిపాళ్యంతోపాటు పలు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. మధ్యలో పనులు ఆపడంతో పలు విమర్శలు వచ్చాయి. ముడుపులు ఇవ్వని కారణంగా పనులు ఆగాయని, వచ్చిన నిధులు సైతం వెనక్కి వెళ్లినట్లు పట్టణంలో చర్చ సాగింది. అదేవిధంగా పైపులైన్ పనులు సైతం ఆగిపోయాయి. దీంతో మడకశిర నగర పంచాయతీ అభివృద్ధి కుంటుపడిందన్న విమర్శలు బహిరంగానే వినిపించాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎమ్మెల్యేగా ఎంఎస్ రాజు గెలుపొందడంతో నగర పంచాయతీ పరిస్థితి మారబోతుందని పట్టణ వాసులు ఆశలు పెట్టుకొన్నారు. దీనికితోడు ఇటీవల నగర పంచాయతీ పీఠాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఏయే కాలనీల్లో పనులు ఆగిపోయాయి..? సీసీ రోడ్ల పరిస్థితి ఎక్కడి వరకు వచ్చింది..? తదితర వివరాలను స్థానికుల ద్వారా తీసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. సమస్యలను ప్రజలద్వారా తెలుసుకుని వాటి పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నారు. ఇప్పటికే పాత కర్ణాటక బ్యాంక్ ప్రాంతంలో బ్రిడ్జ్ నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పలువురు మంత్రులను కలిసి మడకశిర నగర పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేకంగా చర్చలు జరిపి నిధులు మంజూరుకు సైతం అంగీకారం పొందినట్లు పలువురు నాయకులు చెబుతున్నారు. దీంతో నగర పంచాయతీ నియోజకవర్గ కేంద్రం కావడంతో ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఈ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే ముందుకు సాగుతున్నారని వారు అంటున్నారు.

ఆగిన పనులను కొనసాగించేందుకు చర్యలు: ఎమ్మెల్యే

వైసీపీ హయాంలో ఆగిన అభివృద్ధి పనులను కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నా. ముఖ్యంగా కాలనీలో ప్రజలు ఇబ్బందులు పడకుండా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.3 కోట్లతో త్వరలో పనులు ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నాం. మంత్రి నారాయణ దృష్టికి సమస్యలను తీసుకెళ్లడంతో నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు త్వరలో పనులు ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నాం. గతంలో ఆగిన అభివృద్ధి పనులతోపాటు కొత్తగా నగర పంచాయతీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకొంటున్నాం. భవిష్యత్తులో మారిన మడకశిరను చూడబోతున్నారు.

కళకళలాడుతున్న కందిపంట



రొద్దం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు సాగుచేసిన కందిపంట కళకళలాడుతోంది. మండల పరిధిలోని 63 గ్రామాల్లో సుమారు 30వేల ఎకరాల్లో రైతులు కందిపంట సాగుచేశారు. ఒక్కో రైతు 20ఎకరాల నుంచి 350ఎకరాల దాకా సాగుచేశారు. వర్షాల నేపథ్యంలో పంట కళకళలాడుతోంది. పంట పూతదశలో ఉంది. ఎటుచూసినా బంగారు వర్ణం కనిపిస్తోంది. రైతులు కందిపంటకు పచ్చపురుగు ఆశించడంతో మందులను పిచికారి చేసే పనిలో బిజీ బిజీగా ఉన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

డీఎస్పీ మహేష్



నివాళులు అర్పిస్తున్న డీఎస్పీ, సీఐలు, సిబ్బంది

హిందూపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతి భద్రతల కోసం ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని డీఎస్పీ మహేష్ అన్నారు. మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న అమరవీరుల స్థూపంవద్ద నివాళులు అర్పించారు. రహమత్‌పురం సర్కిల్ నుంచి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఎంతో మంది పోలీసులు విధినిర్వహణలో అమరులయ్యారన్నారు. వారందరినీ స్మరించుకుకోవాలన్నారు. పోలీసులు అప్రమత్తంగా ఉండి ప్రజల ప్రాణాలు కాపాడుతూ సమాజం కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీం, ఎస్ఐలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మడకశిరటౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీసు అమరవీరుల పార్కులో మంగళవారం సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రాణాలను లెక్కచేయకుండా విధులలో అసువులు బాసిన పోలీసుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ సుబ్రహ్మణ్యం, రూరల్ సీఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ పోలీసులు ప్రజా రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయరన్నారు. ప్రజల రక్షణే ధ్యేయంగా పనిస్తుంటారని పేర్కొన్నారు. అమరులైన పోలీసుల ఆశయాల సాధన కోసం కృషిచేద్దామన్నారు. ప్రజా స్వామ్యవ్యవస్థలో పోలీసులు పాత్ర కీలకమన్నారు. అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



మడకశిరలో నివాళులు అర్పిస్తున్న పోలీసులు

గుడిబండ, (ఆంధ్రజ్యోతి): గుడిబండలో పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఎస్సై రాజకుల్లాయప్ప ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విధినిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజకుల్లాయప్ప, ఏఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్టు

18 వాహనాల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నరసింగప్ప

మడకశిరటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మడకశిర, బెంగళూరు ప్రాంతాల్లో బైక్‌లను అపహరిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో నిందితుల అరెస్టు వివరాలను డీఎస్పీ నరసింగప్ప మంగళవారం వెల్లడించారు. రొద్దం మండలం రొద్దంకపల్లికి చెందిన ఏ సురేష్, బీ నరేష్, మడకశిర మండలం ఆమిదాలగొందికి చెందిన సంజయ్, మల్లేష్, డి.అచ్చంపల్లికి చెందిన అనిల్, ఇ.అచ్చంపల్లికి చెందిన వడ్డేకుమార్ ముఠాగా ఏర్పడ్డారు. మడకశిర పరిసర ప్రాంతాలతోపాటు బెంగళూరులో ద్విచక్రవాహనాలను అపహరించారు. వాటిని డూప్లికేట్ ఆర్‌సీలతో విక్రయిస్తూ వచ్చారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా నిందితులను మండలంలోని కల్లుమర్రి క్రాస్ వద్ద అరెస్టు చేసి, వారి నుంచి దాదాపు రూ.8.70 లక్షల విలువచేసే 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

కాలభైరవుడి ఆలయంలో

అమావాస్య పూజలు

ధర్మవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చక్రవర్తి థియేటర్ సమీపంలో ఉన్న కాలభైరవస్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమావాస్య ఘడియల్లో ఆలయ పూజారి ధనుంజయ ఆచారి ఆధ్వర్యంలో దోషనివారణ పూజలు చేశారు. కూష్మాండ దీపోత్సవాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయం ఎదుట గుమ్మడికాయపై దీపాలు వెలిగించారు.


ఘనంగా దీపావళి



సాయినాథుని ఆలయంలో వేడుకలు నిర్వహిస్తున్న మహిళలు

మడకశిరటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దీపావళి పండుగను పురస్కరించుకొని దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిగాయి. అదేవిధంగా అభయ ఆంజనేయస్వామి, చంద్రమౌళీశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. షిరిడీ సాయినాథుని ఆలయంలో మహిళలు దీపాలను వెలిగించి పండుగను ఘనంగా జరుపుకొన్నారు.

మత్తులోనే మృతి



జబీవుల్లా (ఫైల్)

హిందూపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రహమత్‌పురం ప్రాంతానికి చెందిన జబీవుల్లా(34) సూరప్పకుంటలో సోమవారం మృతిచెందాడు. సోమవారం అటుగా వెళ్లేవారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మొదట గుర్తుతెలియని వ్యక్తిగా పోలీసులు అనుమానించారు. ఆ తరువాత అతడి మృతదేహాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు జబీవుల్లాగా చెప్పారు. కొన్నేళ్ల క్రితం జబీవుల్లాకు వివాహమైంది. పెళ్లైన కొద్దిరోజులకే భార్యవెళ్లిపోయింది. మృతుడికి తాగుడు అలవాటు ఉందని, ఆ మత్తులోనే సూరప్పకుంటలోని చెట్లమధ్యలో పడి పోయి మృతిచెందాడని టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం బంధువులకు అప్పగించామన్నారు.

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి స్వీట్లు, పూలతో అలంకరణ

గుడిబండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మల మారెమ్మ అమ్మవారికి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో తహసీల్దార్ శ్రీధర్ పాల్గొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఐముక్తేశ్వరస్వామి ఆలయంలో..



పెనుకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐముక్తేశ్వరస్వామి ఆలయంలో దీపావళి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం అర్చకులు కన్నాస్వామి, మూర్తిస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో అమ్మవారిని, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అశేష సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

సరిహద్దుల్లో నిఘా ఉంచండి

డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



మద్యం బాటిల్ స్కాన్ చేస్తున్న డీసీ, ఏఈఎస్

మడకశిరటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మడకశిర ప్రాంతం కర్ణాటక సరిహద్దును ఆనుకొని ఉండటం వల్ల కర్ణాటక మద్యం నియోజకవర్గంలో ప్రవేశించకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అన్నారు. మంగళవారం అసిస్టెంట్ కమిషనర్ శ్రీరాములుతో కలిసి పట్టణంలోని మద్యం షాపులను తనిఖీ చేశారు. సురక్ష యాప్‌ద్వారా అమ్మకాలు జరుగుతున్నాయా లేదా అనే అంశాలపై మాట్లాడారు. యాప్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరగాలని ఆదేశించారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు.

అనుమానం వస్తే స్కాన్ చేయండి: ఎక్సైజ్ డీసీ

హిందూపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల్లో ఎక్కడైనా నకిలీ మద్యం అని అనుమానం వస్తే వెంటనే ఏపీఎక్సైజ్ సురక్షయాప్ ద్వారా స్కాన్‌చేయాలని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అన్నారు. మంగళవారం హిందూపురంలోని మద్యం షాపులు, బార్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన షాపుల్లో మద్యం విక్రయించేవారికి సూచనలు ఇచ్చారు. ఎవరైనా మద్యం కొనడానికి వచ్చినప్పుడు వారికి అనుమానం వస్తే ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఇవ్వాలన్నారు. అక్కడికక్కడే ఈ యాప్‌ను డౌన్‌లోడ్‌చేసి మద్యం సీసాను చెక్‌చేసి పంపాలన్నారు. ఎవరైనా నకిలీ మద్యం అమ్మాలని ప్రయత్నిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఈయన వెంట ఏఈఎస్ శ్రీరామ్, స్థానిక సీఐ లక్ష్మీదుర్గయ్య ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పావగడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ గ్రాడ్యుయేషన్ ఎన్నికలకు సంబంధించి ఓటు హక్కును పొందేందుకు ఫారం నెంబరు 18లో నవంబరు 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రవి తెలిపారు. నవంబరు 25న తొలి ఓటరు జాబితా విడుదల చేస్తామన్నారు. డిసెంబరు 30వ తేదీన ఓటర్‌లిస్ట్‌ను గ్రాడ్యుయేషన్ వ్యక్తులకు అందజేస్తామని ఆయన తెలిపారు. తుమకూరు, చిత్రదుర్గం, దావణగెరె, కోలార్, చిక్కబళ్లాపురం జిల్లాలోని డిగ్రీ పూర్తి చేసిన వ్యక్తులు ఓటు హక్కు కోసం దరఖాస్తుచేసుకోవాలన్నారు.

వాన కురిసింది.. రోడ్డు మడుగైంది..!



రహదారిపై నిల్వ ఉన్న వర్షపు నీరు

గుడిబండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌రాయాపురం గ్రామ సమీపంలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై కురిసిన వర్షానికి నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జీఓను సవరించాలి

పెనుకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులు విడుదల చేసిన 60, 61 ఉత్తర్వులను సవరించాలని స్కూల్‌టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మారుతిప్రసాద్, కార్యదర్శి జయక్రిష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్, మక్కిశెట్టికుమార్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.